క్లుప్తంగా

విజయకుమార్‌రెడ్డిని కలిసిన నేతలు



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో 18వ డివిజన్ నేతలు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. డివిజన్లోని సమస్యలను ఆయనకు తెలియజేశారు.

త్వరితగతిన భవన నిర్మాణం పూర్తి



భవనాన్ని పరిశీలిస్తున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు సిటీ: కొత్తూరులో అసంపూర్తిగా ఉన్న డీపీఆర్సీ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న ఈ భవనాన్ని గురువారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. సత్వరమే పూర్తి చేసేలా చూడాలని సూచించారు.

కుట్టు మెషీన్లు, గ్రైండర్ల పంపిణీ



నెల్లూరు(అర్బన్): పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని పుత్తా ఎస్టేట్స్‌లో కుట్టు మెషీన్లు, గ్రైండర్లను మహిళా వాకర్స్ తరఫున ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ అధ్యక్షురాలు పర్వీన్ గురువారం అందజేశారు. రెడ్‌క్రాస్ ఎమ్సీ మెంబర్ నేతాజీ సుబ్బారెడ్డి, నేతలు బలరామయ్య నాయుడు, పలగాటి శ్రీనివాసులురెడ్డి, రాఘవ రెడ్డి, రాఘవేంద్రశెట్టి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు నివాళులు



నెల్లూరు(బృందావనం): ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ట్రంక్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి బీజేపీ నేత సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నివాళులర్పించారు. పిట్టి సత్యనాగేశ్వర రావు, సుబ్రహ్మణ్యం, రంగరాజన్, సుబ్రహ్మణ్యం, శ్రీహరి ఆచారి, హర్షవర్ధన్, మరాఠా మిత్రమండలి నేతలు ప్రకాష్, బాజీరావు, రాజ్ పురోహిత్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 41వ డివిజన్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం చేపట్టారు. కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నందిమండలం భానుశ్రీ, పాలూరు నాగేశ్వరరావు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు: గుంటూరుకు చెందిన అమరావతి ఎడ్యు హబ్ ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఒలింపియాడ్ పరీక్షలో పట్టణంలోని అమరావతి పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రతిష్టాత్మక గురుదేవోభవ అవార్డు పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వర్లుకు దక్కింది. బెస్ట్ స్కూల్ అవార్డును కూడా అందుకున్నామని కరస్పాండెంట్ కె.సురేష్ గురువారం తెలిపారు.

లైటింగ్ బోర్డుల పైనా బాదుడే..!

- దుకాణాలపై కొత్తగా పన్ను విధింపు
- ఇదేమి చోద్యం అంటున్న వ్యాపారులు
- రూ.ఆరు వేల వరకు వసూలు



ట్రంక్‌రోడ్డులోని షాపుల ముందు ఉన్న లైటింగ్ బోర్డులు

నెల్లూరు(బారకాసు): సంపద సృష్టిస్తా.. అదే నా లక్ష్యం అంటూ సీఎం చంద్రబాబు తరచూ ఊదరగొడుతుంటారు. అయితే పన్నుల మోత మోగించి.. దాని ద్వారానే ఆయన సాధించనున్నారనే అంశం కూటమి ప్రభుత్వ చేష్టలతో స్పష్టమవుతోంది. ఇప్పటికే పన్నుల పెంపుతో సతమతమవుతుండగా, తాజాగా వీరి కన్ను దుకాణాలపై పడింది. లైటింగ్ బోర్డులకు పన్ను విధించనుండటంతో బెంబేలెత్తడం వ్యాపారుల వంతవుతోంది. ఎక్కడో మహానగరాల్లో అమల్లో ఉన్న ఈ విధానాన్ని నెల్లూరు నగరపాలక సంస్థకూ తీసుకురావడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

సైజ్ బట్టి వసూలు

నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. దీనికి తోడు దుకాణాలు, షాపింగ్‌మాళ్లు, ఆస్పత్రుల సంఖ్య పెరుగుతోంది. చిన్నబజార్, పెద్దబజార్, ట్రంక్ రోడ్డు, కాపువీధి, మినీబైపాస్, మాగుంట లేఅవుట్, పొదలకూరురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, బాలాజీనగర్, పొగతోట, రంగనాయకులపేట, సంతపేట తదితర ప్రాంతాల్లో దుకాణాలు, షాపింగ్ మాళ్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. తమ దుకాణాల పేర్లు ప్రజలకు కనిపించేలా నేమ్‌బోర్డులను ఎంతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి వేళ కనిపించేలా ఎల్‌ఈడీ లైటింగ్‌నూ అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటి వరకు అంతా బాగానే ఉన్నా, తాజాగా నగరపాలక సంస్థలో లైటింగ్ బోర్డులున్న ఆయా దుకాణాలకు బోర్డు సైజును బట్టి రూ.రెండు వేల నుంచి రూ.ఆరు వేల వరకు పన్నును టౌన్ ప్లానింగ్ అధికారులు ఏడాదికోసారి వసూలు చేయనున్నారు.

ఈ పన్నేంటి బాబోయ్..

ప్రభుత్వ నిబంధనల మేరకు ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్, కమర్షియల్ ట్యాక్స్ ఇలా అన్ని చెల్లిస్తూ తమ వ్యాపారాలను సాగించుకుంటున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వ నిబంధనల మేరకు లైటింగ్ బోర్డులకు పన్ను కట్టాలని నోటీసులను జారీ చేయడంపై వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ప్రశ్నిస్తే ఇబ్బందులు ఏర్పడతాయనే భయంతో గత్యంతరం లేక వీటిని చెల్లించాల్సి వస్తోంది. అసలే వ్యాపారాలు అంతంతమాత్రంగా జరుగుతున్న తరుణంలో వీటిని చెల్లించాలని ఒత్తిడి చేయడం తగదని పేర్కొంటున్నారు. తమకు మంచి జరుగుతుందనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించామని, అధికారంలోకి వచ్చాక ఇలా పన్నుల మోత మోగించడం తగదని వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటివేవీ లేవనే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. కాగా ఈ అంశమై టౌన్‌ప్లానింగ్ విభాగ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణును సంప్రదించగా, ప్రభుత్వ నిబంధనల మేరకు.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే దుకాణాలకున్న అదనపు లైటింగ్ బోర్డుల సైజును బట్టి పన్ను విధించి వసూలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లలోనూ ఇదే తరహాలో పన్నులను వసూలు చేస్తున్నారని బదులిచ్చారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి



సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి, సుందరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని 16వ డివిజన్లో గల రామ్‌జీనగర్ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించిన ఆయన మాట్లాడారు. చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, వ్యాపారాలు సాగిస్తున్నారని, వీటిని తొలగించాలని సూచించారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులను జారీ చేసి, వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్‌ను వసూలు చేయాలని ఆదేశించారు. అనుమతుల్లేని భవన నిర్మాణాలను గుర్తించి, పిల్లర్ల స్థాయిలోనే ఆపేయాలని పేర్కొన్నారు. డివిజన్లోని అన్ని కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టి, సిల్టును ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు. చెత్త నుంచి ఎరువు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, పట్టణ ప్రణాళిక విభాగాధికారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంతకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 15 వరకు నిర్వహించనున్నామని మందిర కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తన్నీరు మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పుత్రకామేష్టి యాగంతో బ్రహ్మోత్సవాలను శనివారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభించనున్నామని వెల్లడించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని విశేష పూజా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించనున్నామని చెప్పారు. విశేష పూజలను రోజూ నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు. మందిర కమిటీ కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, గౌరవ సలహాదారులు ప్రసన్నాంజనేయులు, ప్రసాద్ రావు, స్వామి హనుమంతరావు, బృందావనం శ్రీనివాసదీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

సాల్వేషన్ ఆర్మీ టెరిటోరియల్ యూత్ కాంగ్రెస్ సమావేశం



నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో సాల్వేషన్ ఆర్మీ టెరిటోరియల్ యూత్ కాంగ్రెస్ సమావేశాన్ని గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఆర్మీ ఇంటర్నేషనల్ కమిషనర్ ఎడ్వర్డ్ హిల్, షెల్లీ హిల్ దంపతులు హాజరయ్యారు. వీరికి సాల్వేషన్ ఆర్మీ జిల్లా ప్రముఖులు రూథర్ శామ్యూల్, విజయకుమార్, విజయప్రసాద్, మేరీగ్రేసీ, చంద్రరాజు, తలారి బాలసుధాకర్ తదితరులు స్వాగతం పలికారు.

చిత్రాన్ని ఆదరించరూ..

నెల్లూరు రూరల్: ఎల్ఆర్ ఫిల్మ్ సర్క్యూట్ సంస్థ నిర్మించిన చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని దర్శక, నిర్మాత లీలాధర్‌రావు కోరారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం పోస్టర్లను ప్రదర్శించారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీకి గురైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు గురువారం నమోదు చేశారు. వివరాలు.. టెక్కేమిట్టకు చెందిన వస్త్ర వ్యాపారి చక్రవర్తి.. పొగతోటకు గత నెల 28న వెళ్లారు. ఓ హాస్పిటల్ ముందు తన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను నిలిపి సమీపంలోని దుకాణం వద్దకెళ్లారు. తిరిగొచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): స్నేహితుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడ్ని దర్గామిట్ట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఖుద్దూస్‌నగర్‌కు చెందిన ఆసిఫ్ తన స్నేహితులతో కలిసి మాగుంట లేఅవుట్లోని ఓ లాడ్జికి సోమవారం వెళ్లారు. స్నేహితుల్లో ఒకరైన సాబీర్ మద్యం మత్తులో ఆసిఫ్‌తో గొడవపడ్డారు. ఇద్దరూ నెట్టుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన సాబీర్ అన్న షఫీవుద్దీన్ కత్తితో ఆసిఫ్ పొట్టలో బలంగా పొడిచారు. ఇంకా బలంగా పొడవాలంటూ సాబీర్ ప్రోత్సహించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుల్లో ఒకరైన షఫీవుద్దీన్‌ను అరెస్ట్ చేశారు.

విశ్రాంత ఆచార్యుడికి సత్కారం

నెల్లూరు(బృందావనం): వీఆర్ కళాశాల విశ్రాంత ఆచార్యుడు కాంజీవరం రాధాకృష్ణను అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా గురువారం సత్కరించారు. రమేష్‌రెడ్డినగర్‌లోని ఆయన స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు టేకుమళ్ల వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



మాట్లాడుతున్న నిర్వాహకులు

నెల్లూరు సిటీ: ప్రతిష్టాత్మక నేషనల్ స్పేస్ సొసైటీ.. స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని ఇథాకా ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కనుపర్తిపాడులోని పాఠశాలలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గ్రేడ్ - 10 విభాగంలో మన్నూరు మోక్షిత్‌రెడ్డి రూపొందిన ప్రాజెక్ట్ పుల్మెన్‌కు ద్వితీయ బహుమతి.. గ్రేడ్ 8 విభాగంలో మొహమ్మద్ అమాస్ ప్రాజెక్ట్ నాటిలస్‌కు తృతీయ బహుమతి లభించిందని వివరించారు. జీఎం జీవన్, అకడమిక్ డైరెక్టర్ రాణి, ప్రిన్సిపల్ శోభన లక్ష్మీనారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భాగవత సప్తాహ ప్రవచనం



నెల్లూరు(బృందావనం): వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నవాబుపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ ప్రవచనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కృష్ణబాల్యలీలలపై అవధాని కోట రాజశేఖర్ ఉపన్యసించారు. తొలుత అష్టాదశ గీతా శ్లోకాలను ఆలయ అర్చకుడు మల్లవరపు లక్ష్మీనరసింహరావు పఠించారు. మూలవర్లకు అర్చన, గురుగ్రహ హోమం, పూజాదికాలను నిర్వహించారు. అనంతరం రాజశేఖర్‌ను సత్కరించారు. ఉభయకర్తలుగా గండవరపు చంద్రశేఖర్ దంపతులు వ్యవహరించారు. సాదా నాగేంద్ర, కంచి జ్ఞానేంద్ర, చక్రాల ఆనందకుమార్, స్వామి సమయానందనాథ, గుండాపంతుల రామసుబ్రహ్మణ్యంశర్మ, వేలూరు నారాయణస్వామి, రమణమూర్తి తదితరులు పర్యవేక్షించారు.

ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలి

సాక్షి ఎఫెక్ట్..



అపరిశుభ్రతను పరిశీలిస్తున్న చైతన్య

నెల్లూరు(బారకాసు): ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచేలా తగు చర్యలు చేపట్టాలని ఎంహెచ్‌ఓ చైతన్య ఆదేశించారు. ఖాళీ స్థలాలు.. పారిశుధ్యానికి తూట్లు అనే శీర్షికన సాక్షిలో ఈ నెల ఒకటిన కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ క్రమంలో 19వ డివిజన్లో పర్యటించి, ఖాళీ స్థలాల్లో నెలకొన్న అపరిశుభ్రతను గుర్తించారు. వీటిని శుభ్రంగా ఉంచుకునే విషయమై సంబంధిత యజమానులకు తెలియజేయాలని సూచించారు. ఆయా స్థలాల ముందు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కాలువల్లో ఆయిల్ బాల్స్, మందు పిచికారీ, ఫాగింగ్ తదితరాలను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి, వ్యర్థాలను గమనించారు. టౌన్ ప్లానింగ్ విభాగాధికారులకు తెలియజేసి వారి సాయంతో మార్గాన్ని క్లియర్ చేయించాలని సూచించారు.

జీరో వేస్ట్‌పై వ్యాపారులకు అవగాహన



మాట్లాడుతున్న బాలకృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జీరో వేస్ట్‌పై మార్కెట్ వ్యాపారులకు అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలకృష్ణ మాట్లాడారు. కూరగాయల చెత్తను రోడ్లపై కాకుండా చెత్త బుట్టల్లోనే వేయాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా రీసైక్లింగ్ చేసేందుకు అవకాశమున్న వాటినే వినియోగించాలని కోరారు. మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత వ్యాపారులదేనని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

విశ్రాంత ఉద్యోగికి ఆర్థిక సాయం



నెల్లూరు(క్రైమ్): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విశ్రాంత ఎస్సై సాయికృష్ణ కుమారుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నారు. కిడ్నీ మార్పిడి కోసం పెద్ద మొత్తంలో నగదు అవసరమవుతుందనే విషయాన్ని తెలుసుకున్న ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఎక్సైజ్ అధికారులు, విశ్రాంత అధికారులు, సిబ్బంది తమ వంతుగా రూ.3,67,616ను సేకరించారు. ఈ క్రమంలో బీవీనగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో సాయికృష్ణకు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు గురువారం అందజేశారు. ఏఈఎస్‌లు రమేష్, జగదీశ్వర్‌రెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం



రికార్డులను అందజేస్తున్న సుజాత

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లు, డాక్టర్లు రాసిన రక్త పరీక్షలను నాణ్యతగా నిర్వహించి సకాలంలో రిపోర్టులివ్వాలని డీఎంహెచ్‌ఓ సుజాత సూచించారు. సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పీహెచ్‌సీల పరిధిలో 63 రకాల రక్త పరీక్షలున్నాయని, రోగుల అవసరాన్ని బట్టి నిర్వహించాలని సూచించారు. సమయపాలన పాటించడంతో పాటు ఎఫ్ఆర్ఎస్ హాజరును విధిగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ మాట్లాడారు. అనుమానం ఉన్న ప్రతి రోగికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వివరాలను నిశ్చయ్ పోర్టల్లో నమోదు చేయాలని కోరారు. క్షయ అనుమానిత కేసులకు సంబంధించి 45 పీహెచ్‌సీల్లో 65 శాతం మేరే పరీక్షలు చేశారని పేర్కొన్నారు. అనంతరం టెక్నీషియన్లకు రికార్డులను పంపిణీ చేశారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, మలేరియా సహాయాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపు సరళతరం





బిల్లులో పొందుపర్చిన క్యూఆర్ కోడ్

- విద్యుత్ వినియోగదారుల ఇక్కట్లకు చెక్
- క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చిన ఎస్పీడీసీఎల్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లుల చెల్లింపులను సరళతరం చేయాలనే ఉద్దేశంతో క్యూఆర్ కోడ్‌ను ఎస్పీడీసీఎల్ అందుబాటులోకి తీసుకొచ్చింది. బిల్లులను చెల్లించేందుకు గానూ కొందరు వసూలు కేంద్రాలకు వెళ్తుండగా, మరికొందరు ఆన్‌లైన్ విధానాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో డిజిటల్ చెల్లింపులు జరిపే వినియోగదారులు కొంతకాలంగా ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితరాల ద్వారా జమచేసే ప్రక్రియను నిలిపేసి, ఎస్పీడీసీఎల్ యాప్‌ను సంస్థ ప్రవేశపెట్టింది. అయితే ఇది సక్రమంగా పనిచేయకపోవడం, వినియోగం కష్టతరమైంది. ఫలితంగా చెల్లింపుల్లో చాలా జాప్యం జరుగుతోంది. ఈ తరుణంలో ఈ ఇక్కట్లకు చెక్ పెట్టేందుకు గానూ క్యూఆర్ కోడ్‌ను ఎస్పీడీసీఎల్ ఈ నెల ఒకటిన అమల్లోకి తీసుకొచ్చింది. వినియోగదారులకు ఇచ్చే బిల్లులోనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించి అందజేస్తున్నారు. ఫలితంగా ప్రజల ఇబ్బందులు కొంతమేర తీరాయి. బిల్లులో పొందుపర్చిన క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా స్కాన్ చేసి నగదును చెల్లించే అవకాశం ఏర్పడింది. కాగా బకాయిల్లేని వారికే ఈ తరహాలో బిల్లు ప్రస్తుతానికి జారీ అవుతోంది.